www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 11 | సెప్టెంబర్ | 2025 పేజీలు : 8

## యూరియా పక్కదారి.. అడ్డుకున్న రైతులు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ సొసైటీ కార్యాలయంలో యూరియా బస్తాలను అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని ఆటోలో వేసిన యూరియా బస్తాలను కిందపడేసి అడ్డుకొన్న సంఘటన బుధవారం జరిగింది. గత కొన్ని రోజులుగా రైతులకు పాల్వంచ సొసైటీ కార్యాలయం ద్వారా రైతులకు యూరియా బస్తాలను అందజేస్తున్నారు. ఆధార్ కార్డుతో పాటుగా సాగు చేస్తున్న భూమికి సంభంధించిన పత్రాలను తీసుకొచ్చిన రైతులకు యూరియా సరఫరా

మిగతా 2లో..

## నేటి నుంచి సాయుధ రైతాంగ పోరాట
# వారోత్సవాలు

**-రేపు ఖమ్మంలో మోటార్ సైకిల్ ర్యాలీ**
**-17న ముగింపు సభ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ తెలంగాణ పోరాట వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. సాయుధ పోరాట వీర గాథలను నేటి తరానికి తెలియజేస్తూ సాయుధ పోరాటానికి కేంద్రంగా నిలిచిన పలు గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సాయుధ పోరాట కాలంలో ఆశువులు బాసిన అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించడం జరుగుతుందని సురేష్ తెలిపారు. ఈనెల 11న ఖమ్మం జెడ్పి సెంటర్ నుంచి జరిగే మోటార్ సైకిల్ ర్యాలీతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ స్మారక స్తూపం వద్ద సభ జరుగుతుందని సురేష్ తెలిపారు. 12న ఎం. వెంకటాయపాలెం, 13న ప్రొద్దుటూరు, బోనకల్ మండలం గోవిందాపురం



గ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు. 14న కొణిజర్ల మండలంలో సాయుధ పోరాట వారోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. 15న సత్తుపల్లి, నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లోనూ, 16న బోనకల్, మధిర మండలాల్లో సాయుధ పోరాట వారోత్సవ సభలు జరుగుతాయని 17న ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ముగింపు సభ జరుగుతుందని సురేష్ తెలిపారు.







# తిరోగమనమా..పురోగమనమా...

**-సాయుధ పోరాట సారధిగా తిరుపతి**
**-మావోయిస్టు పార్టీ బాధ్యతలు మరోసారి తెలుగు వారికి..**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మావోయిస్టు ఉద్యమం అత్యంత సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో ఉనికిని చాటుతూ కొన్ని ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాలు నడిపిన మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వ వైఖరితో భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్న వేళ కొత్త సారధి ఎన్నిక జరిగింది. మావోయిస్టు ఉద్యమ చరిత్రలో కార్యదర్శిగా ఉండి ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన నంబాల కేశవరావు తర్వాత మావోయిస్టు పార్టీ సారధ్య బాధ్యతలపై ఎన్నో ఊహాగానాలు జరిగాయి. పలువురి పేర్లు పరిశీలనలోకి వచ్చినా ఎట్టకేలకు తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ ప్రస్తుత జగిత్యాలకు చెందిన 58 ఏళ్ల తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వం 2026 నాటికి మావోయిస్టులను ఈ దేశంలో లేకుండా చేస్తామని ప్రకటించి ఆ దిశగా సాయుధ బలగాలను మోహరించింది. మావోయిస్టు పార్టీకి ప్రధాన కేంద్రంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంపై దృష్టి కేంద్రీకరించి దాదాపు మావోయిస్టు స్థావరాలన్నింటిని జల్లెడపట్టి పోలీస్ బేస్ క్యాంపులను ఏర్పాటు చేసింది. మావోయిస్టులు తలదాచుకున్నారన్న నేపంతో 25వేల మంది పోలీసులతో కర్రెగుట్టలను జల్లెడ పట్టారు. ఆ క్రమంలోనే అనేక మంది ఎన్‌కౌంటర్ల పేరుతో హతమయ్యారు. మావోయిస్టు భవితవ్యంపై నీలి నీడలు కమ్ముకుంటున్న వేళ మావోయిస్టు పార్టీ నూతన కార్యదర్శిని ప్రకటించింది. ఈ దశలో నూతన సారధ్యంలో మావోయిస్టు తిరోగమనమా పురోగమనమా అన్నదానిపై విస్తృతంగా చర్చ

మిగతా 2లో..

# ట్రంప్‌కు దాసోహమంటున్న మోడీ










**-సుంకం రద్దుతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం**
**-బలమైన రైతాంగ ఉద్యమాలే సాగుకు రక్ష**
**-ఎస్‌కెఎం సదస్సులో వక్తలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆంక్షలకు మోడీ తలొగ్గి దాసోహమంటున్నాడని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ఆరోపించారు. వ్యవసాయ రంగ ఉత్పత్తులు ముఖ్యంగా పత్తి దిగుమతి పై సుంకాన్ని రద్దు చేయడం భారతదేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సదస్సు బుధవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. రైతు సంఘాల నేతలు దొండపాటి రమేష్, మాదినేని రమేష్, మలీదు నాగేశ్వరరావు, బజ్జూరి వెంకట్రామిరెడ్డి అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో ఎస్‌కెఎం నేతలు మాట్లాడుతూ అమెరికాలో వ్యవసాయ రంగానికి 36 శాతం సబ్సిడీ ఇస్తున్నారని తెలిపారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై గతంలో 11 శాతం పన్ను విధించే వారని ఇప్పుడు మోడీ సర్కార్ ఆ పన్నును ఎత్తివేయడంతో దేశ వ్యాప్తంగా పత్తి సాగు చేస్తున్న రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా పత్తి ధరలు క్షిణించి పత్తి సాగు చేయాలంటే జంకే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పెట్టుబడి ఆధారంగా పత్తికి రూ . 10075 ప్రకటించాలని ఆందోళనలు చేస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోకపోగా రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. పత్తి మొదటి రకానికి రూ. 8210, రెండవ రకానికి రూ. 7710 ఇవ్వాల్సి ఉండగా బహిరంగ మార్కెట్‌లో ఆరువేలకు మించి కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. భారతదేశ వ్యాప్తంగా గణనీయంగా పత్తిని సాగు చేస్తున్నారని తెలంగాణలోనే సుమారు 50 లక్షల ఎకరాల్లో

మిగతా 2లో..

# ట్రంప్‌కు దాసోహమంటున్న మోడీ




(మొదటిపేజీ తరువాయి)
పత్తిని సాగు చేస్తున్నారని ఎస్‌కెఎం నేతలు తెలిపారు. రైతాంగం సాగు కలిసి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి సతమతమవుతున్నా పట్టించుకోని మోడీ సర్కార్ వ్యవసాయ రంగ సబ్సిడీలను క్రమేపి తగ్గించిందని ఇదే సమయంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్పొరేట్ రుణాలను రద్దు చేసిన ప్రభుత్వం రైతుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బలమైన రైతాంగ ఉద్యమాలు నిర్మించబడి ఆందోళనలు చేపడితేనే వ్యవసాయ రంగం పరిరక్షించబడుతుందని వారు తెలిపారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 536 సంఘాలు వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయని ఆ క్రమంలోనే సదస్సు నిర్వహించ బడుతుందన్నారు. సదస్సులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాగం హేమంతరావు, పశ్య పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, అఖిల భారత రైతు కూలీ సంఘం కేంద్ర కన్వీనర్ కెచ్చల రంగయ్య, ఏఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి. కోటేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు, రైతు సంఘాల ప్రతినిధులు బొంతు రాంబాబు, కోలేటి నాగేశ్వరరావు, వై. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు ముందు బైపాస్ రోడ్డులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని, రద్దు చేసిన దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని, వ్యవసాయోత్పత్తులన్నింటికి మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# తిరోగమనమా.. పురోగమనమా...

(మొదటిపేజీ తరువాయి)
సాగుతుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించినట్లుగా మావోయిస్టు పార్టీని లేకుండా చేయడం అసాధ్యం కావచ్చు కానీ అదే సమయంలో తిరిగి దండకారుణ్యంపై మావోయిస్టులు పట్టు సాధించడం కూడా ఆలోచించాల్సిన విషయమే. గతంలో మావోయిస్టు పార్టీకి అటవీ సమీప గ్రామాల ప్రజల సంపూర్ణ మద్దతు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దానితో పాటు పోలీసుల వద్ద ఉన్న అధునాతన ఆయుధాలు అన్నింటికి మించి మావోయిస్టు సాయుధ బలగాల్లో పనిచేస్తున్న క్యాడర్ నాయకత్వం పట్ల విశ్వసనీయతను కోల్పోతుంది. ఒకరిద్దరు పోలీసులతో చేతులు కలపడం వల్లనే నంబాల కేశవరావు మృతిచెందారన్నది వాస్తవం. ఈ పరిస్థితుల్లో ప్రజల మద్దతు సైద్ధాంతిక శిక్షణ కలిగిన క్యాడర్ లేకపోవడం మావోయిస్టు ఉద్యమ మనుగడకు తీవ్ర అవరోధం కానున్నాయి. మరో పక్క అమిత్‌షా సవాల్‌కు ఇంకో ఆరు మాసాల సమయం ఉన్నది. మావోయిస్టు ఉద్యమం కేవలం వామపక్ష తీవ్రవాదంగా భావించకుండా సామాజిక రాజకీయ ఆర్థిక సమస్యగా పరిగణించాల్సి ఉంది. ఈ సందర్భంలో రాజకీయ సామాజిక ఆర్థిక సమస్యలకు సరైన పరిష్కారం చూపకుండా మావోయిస్టు పార్టీని అంతం చేయడమన్నది సాధ్యమయ్యే పని కాదు. ఒకవేళ మావోయిస్టు పరంగా సరైన కార్యాచరణ లేకపోతే తీవ్రవాదం మరో రూపు సంతరించుకుంటుంది తప్ప మావోయిస్టులను కాల్చి చంపడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించడం లేదు. కొత్త సారథి తిరుపతికి పార్టీని కాపాడడంతో పాటు పురోగమన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో మిలిటెంట్ దాడులు చేయడంలో సిద్ధహస్తుడిగా పేరొందిన హిడ్మాకు దండకారుణ్య బాధ్యతలను అప్పగించింది. దశాబ్ద కాలంగా హిడ్మా అనేక హింసాత్మక చర్యలకు నేతృత్వం వహించాడు. దాడి చేయడంలోనూ, తప్పించుకోవడంలోనూ పేరొందిన హిడ్మా ప్రజలతో మమేకమై ఉంటాడని పేరుంది. ఆయనకు దండకారుణ్య బాధ్యతలు అప్పగించడంతో మావోయిస్టు ఉద్యమ మనుగడపై కొంత మంది ఆశలు పెంచుకుంటున్నారు. ప్రజలతో మమేకం కావడం వల్లే పోలీసులు హిడ్మా జాడను కనుగోనలేకపోతున్నారన్న వాదన వినిపిస్తుంది. మొత్తంగా మావోయిస్టు నూతన సారథిగా బాధ్యతలు చేపట్టిన తిరుపతి ముందు పెను సవాళ్లు ఉన్నాయన్నది వాస్తవం. మావోయిస్టు జీవితమంటేనే ప్రాణాన్ని ఫణంగా పెట్టి పోరాడటం ఇప్పుడు ప్రాణం కంటే పార్టీ మనుగడే ప్రశ్నార్థకమైంది.

**మరోసారి తెలుగు వారికి దక్కిన అవకాశం...**

సాయుధ పోరాట ప్రభావం ఇప్పటి ఆంధ్రాలోని నల్లమల అటవీ ప్రాంతంతో పాటు ఉత్తరాంధ్రకు పరిమితం కాగా తెలంగాణలో గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు పరిమితమైంది. రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో మావోయిస్టు కార్యాచరణ లేకపోయినా నాయకత్వ స్థాయిలో మాత్రం తెలుగు వారే కొనసాగుతుండటం గమనార్హం. కమ్యూనిస్టు పార్టీలో పలు చీలికల తర్వాత సాయుధ పంథాను ఎంచుకున్న ఒకప్పటి పీపుల్స్ వార్ ఇప్పటి మావోయిస్టు పార్టీకి తెలుగు వారే సారథ్యం వహించారు. కెఎస్‌గా పేరొందిన కొండపల్లి సీతారామయ్య, లక్ష్మణ్‌రావు, నంబాల కేశవరావు సుదీర్ఘ కాలం నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించారు. ఇప్పుడు మరోమారు తెలంగాణ రాష్ట్రానికి చెందిన తిరుపతి అలియాస్ దేవ్‌జీకి మావోయిస్టు పగ్గాలు అప్పగించారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రిజ్ అందజేత



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని గతంలో ఉన్న కెవిసిఎం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎంజెపిటి బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినిల అవసర నిమిత్తం ఫ్రిజ్‌ను బుధవారం ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ వివరిస్తూ స్థానిక తహశీల్దార్, ప్రిన్సిపాల్ రాధిక సంప్రదించారని వారి పిలుపు మేరకు పాఠశాల పరిసరాలను గదులను చదువు ఫ్యాకల్టీ విషయాలను అడిగి తెలుసుకొని ఈ పాఠశాలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారని డాక్టర్ కాపా మురళీకృష్ణ తెలిపారు. 400 మంది ఉన్న విద్యార్థినిల కోసం ముఖ్యంగా వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్ కావాలని అదేవిధంగా పాలు, పెరుగు ఉంచడానికి ముందుగా ఫ్రిజ్ అవసరమని వారు తెలిపారు. వారు అడిగిన వెంటనే ముందుగా ఫ్రిజ్‌ను వుంద్రు శ్యామ్‌బాబు, వరలక్ష్మి దంపతుల కుమారుడు అజయ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా అందించామని తెలిపారు. మిగతా మౌళిక సదుపాయాలు కూడా కల్పిస్తామని మురళీకృష్ణ తెలిపారు. అడిగిన వెంటనే లయన్స్‌క్లబ్ ప్రముఖులైన డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, వుంద్రు శ్యామ్‌బాబు సదుపాయాలు కాల్పిస్తామని హామీ ఇచ్చినందుకు వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జిల్లా విజన్ కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు, రీజియన్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్, క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చిరామారావు, సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు, జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్ తోటకూర శ్రీకంత్, గ్రేట్ విజన్ క్లబ్ సెక్రటరీ గంగవరపు కిషన్‌రయి, కోశాధికారి ఉయ్యూరి రామకృష్ణ, ఏపూరి రాజారావు, మరికంటి రాంగోపాల్, అజయ్‌బాబు, ఉపాధ్యాయులు జరీనా, కమల, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు ఎమ్మెల్యే దంపతుల పరామర్శ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని పలు కుటుంబాలను సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా దంపతులు బుధవారం పరామర్శించారు. మండల పరిధిలోని సత్యంపేట గ్రామంలో ఇంకుడు గుంతలో పడి చిన్నారి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దంపతులు వారి నివాసానికి చేరుకుని చిన్నారికి నివాళ్ళులర్పించి తల్లిదండ్రులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో జరిగిన ఖర్మకు హాజరైనారు. అదేవిధంగా తుమ్మూరు గ్రామ మాజీ సర్పంచ్ కర్లంపూడి రామారావు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటికి చేరుకోగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దంపతులు రామారావు నివాసానికి చేరుకుని అనారోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొడ్డా శ్రీను అత్తమ్మ, తుమ్మూరు గ్రామానికి చెందిన తాళ్ళూరి సత్యవతి ప్రథమ వర్ధంతికి హాజరై సత్యవతి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, దొడ్డా శంకర్ రావు, మోరంపూడి జగన్ ఉన్నారు.

# యూరియా పక్కదారి.. అడ్డుకున్న రైతులు



(మొదటిపేజీ తరువాయి)
చేస్తున్నారు. దీని కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో కార్యాలయ సిబ్బందికి ఓ వ్యక్తికి ఇవ్వాల్సిన ఎనమిది యూరియా బస్తాలకు బదులుగా బోడుకు చెందిన ఆటోలో 17 యూరియా బస్తాలను హమాలీలు వేస్తున్నారు. దీనిని గమనించిన రైతులు ఏ గ్రామానికి తీసుకెళుతున్నారని ఆటో డ్రైవర్‌ను ప్రశ్నించగా మహబూబాబాద్ కు తీసుకుతున్నట్లు తెలిపారు. రోజుల తరబడి ఇక్కడ ఎదిరి చూస్తున్న రైతులను కాదని వెరే జిల్లాకు తరలించడంపై రైతులు కోపోద్రిక్తులయ్యారు. వెంటనే ఆటోలో వేసిన యూరియా బస్తాలను కిందకు దించారు. ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. యూరియా బస్తాలను తిరిగి గోదాముకు తరలించారు. అనంతరం ఆటోను స్టేషన్‌కు తరలించారు. రైతులు గత నెల రోజులకు పైగా యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. ఒక్క బస్తా యూరియా కోసం తిండి తిప్పలు మానేసి గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడుతున్నారు. వీరందరినీ కాదని యూరియా బస్తాలు పక్కదారి పట్టిస్తున్న సొసైటీ అధికారుల తీరుతో రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. కాగా పోలీసులను గమనించిన యూరియా కొనుగోలు చేసిన వ్యక్తి పారిపోయాడని, ఆటో డ్రైవర్‌ను పోలీసులు తమదైన రీతిలో విచారణ చేస్తే యూరియా తరలింపు వెనుక ఎవరి హస్తం ఉన్నదో నిజా, నిజాలు తెలుస్తాయంటున్నారు. ఇదే క్రమంలో కార్యాలయ సిబ్బందికి అనుకూలమైన వారికి క్యూలైన్‌ను కాదని ముందుగా ఇస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయంపై సొసైటీ సిఈఓ లక్ష్మీనారాయణను ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. పాల్వంచ సిఐ వివరణ కోరగా ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఇంకా విచారణ చేయలేదని చెప్పారు.

# జవాబుదారీ తనంతో పని చేయండి

**-మధిరలో పైలెట్ ప్రజావాణి అమలుకు చర్యలు**

**-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారి తనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. స్థానిక టిటిడిసి మీటింగ్ హాల్‌లో మధిర నియోజక వర్గంలో చేపట్టనున్న పైలెట్ ప్రజావాణి కార్యక్రమంపై బుధవారం అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించినట్లుగా మధిర నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో పైలెట్ ప్రజావాణి కార్యక్రమ నిర్వహణకు కార్యాచరణ చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సానుకూలంగా ఉన్న ప్రతి దరఖాస్తును సానుకూలంగా పరిశీలించాలని తిరస్కరణకు తప్పనిసరిగా కారణాలు తెలియజేస్తూ లేఖ రాయాలని కలెక్టర్ సూచించారు.పైలెట్ ప్రజావాణి కార్యక్రమం క్రింద ఐఎఫ్‌సి సెంటర్‌లో దరఖాస్తులను స్వీకరించి వాటికి పరిష్కార మార్గం చూపాలని కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. దరఖాస్తులకు సంబంధించి 30 రోజుల్లో నివేదిక తెలపాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, వివిధ మండలాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# వేధింపులకు ఒంటరి మహిళ మృతి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం కప్పల బంధం గ్రామానికి చెందిన మంచినీళ్ళ సరోజిని అదే గ్రామానికి చెందిన కంటిపూడి యోహాన్ తో సుమారుగా గత నాలుగు సంవత్సరాలుగా సహజీవనం చేస్తుంది. కంటిపూడి యోహాన్ బాధితురాలని శారీరకంగా మానసికంగా ఆర్థికంగా తీవ్ర వేధింపులకు గురి చేస్తుండగా తట్టుకోలేక గడ్డి మందు తాగింది. చికిత్స పొందుతూ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించినట్లు ఎస్సై హరిత తెలిపారు. మృతురాలి తమ్ముడు తేళ్లూరు గోపాలరావు ఫిర్యాదు మేరకు కల్లూరు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విలేకరి మృతికి సంతాప సభ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన వేము మోహన్ బాబు (39) అనారోగ్యంతో అకాల మృతి చెందడం పట్ల కల్లూరు మండలం ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా, మీడియా మిత్రులు వారి స్వగ్రామానికి చేరి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ఆయన గత నాలుగు సంవత్సరాలుగా కలం కార్మికునిగా ఉంటూ సేవలను స్మరించుకున్నారు. ఆ కుటుంబాన్ని సందర్శించి కుటుంబానికి ఓదార్పును, ధైర్యాన్ని ఇచ్చారు. అదే విధంగా సిపిఐ జిల్లా మండల నాయకులు క్లైమేట్, తోట రామాంజనేయులు, దామాల దయాకర్ రావులతోపాటు కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్ రావు, బిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్ ,లక్కినేని రఘు లతోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



## -ఐలమ్మకు నివాళులర్పించిన సిపిఐ

ప్రజాపక్షం/ ఖమ్మం : చిట్యాల (చాకలి) ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమ నిర్మాణం జరగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. తెలంగాణలో నైజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా జమీందారి, జాగీర్దారి తనంపై ఐలమ్మ వీరోచిత పోరాటం నిర్వహించారని ఆయన తెలిపారు. ఐలమ్మ వర్ధంతిని పురస్క రించుకుని బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలకు, మానాలకు రక్షణ లేని పరిస్థితుల్లో ఐలమ్మ చూపిన తెగువ, చేసిన పోరాటం వెలకట్టలేనిదన్నారు. తెలంగాణ విముక్తి ఉద్యమంలో ఐలమ్మ లాంటి అనేక మంది వీరోచిత పోరాటాలు నిర్వహించడం వల్లనే నైజాం పాలన అంతమొందిందని హేమంతరావు తెలిపారు. సమస్యల పరిష్కా రానికి ఐలమ్మ లాంటి ఉద్యమ నేతల స్ఫూర్తితో కృషి జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాస రావు, యానాలి సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సురవరం సంస్మరణ సభను జయప్రదం చేయండి

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ మాజీ ప్రధాన కార్య దర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ ఈనెల 13న భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్య దర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, వివిధ రాజకీయ పక్షాల నేతలు పాల్గొంటారని ఆయన తెలిపారు. సిపిఐ వన్‌టౌన్ ఏరియా సమావేశం బుధవారం వన్‌టౌన్ ఏరియా సిపిఐ కార్యాలయంలో కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ 60 సంవత్సరాల సుదీర్ఘ ప్రజా జీవితంలో సురవరం సుధాకర్‌రెడ్డి అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించారని ఆయన తెలిపారు. ప్రజా ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా పనిచేసిన సుధాకర్‌రెడ్డిని స్మరించుకుని భవిష్యత్తు ఉద్యమ నిర్మాణం కోసం జరిగే ఈ సంస్మరణ సభలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ సమావే శంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు, నాయకులు మాదుగుల నాగే శ్వరరావు, మాలకొండయ్య, ఎస్‌కె యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు రాధాకృష్ణ : బాగం

ప్రజాపక్షం/చింతకాని : సీపిఐ కార్యకర్త శీలం రాధాకృష్ణ బ్రతికినం తకాలం ఎర్ర జెండా ఎత్తుకొని నిబద్ధత గల కమ్యునిస్టుగా బ్రతికాడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు పేర్కొన్నారు. కొదుమూరు గ్రామానికి చెందిన సిపిఐ కార్యకర్త రాధాకృష్ణ మంగళ వారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు బుధవారం కొదు మూరు చేరుకొని రాధాకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. ఈసం దర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రాధాకృష్ణ కొదుమూరు గ్రామంలో చిన్నతనం నుంచి పార్టీ పిలుపిచ్చిన ప్రతి కార్యక్రమంలో ముందుండేవాడని గుర్తు చేసుకున్నారు.రాధాకృష్ణ కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు కొల్లి సీతయ్య, మాజీ ఎంపీటీసీ నారపోగు హేమ నాగా



ర్జున, మాజీ సర్పంచ్ నక్కనబోయిన సుజాత కృష్ణ, అనుబోతు వీర బాబు,కోటగిరి పరబ్రహ్మచారి,శాఖ కార్యదర్శి నీరుడు గోవిందరావు, చిట్టిమోదు కొండలు, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, కూచిపుడి వెంకటేశ్వర్లు జనగం వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి



ప్రజాపక్షం/ మధిర : వీర తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చేబ్రోలు ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా సమస్య లపై ఉద్యమించాలి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజ వాడ రవిబాబు, సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండల రావు పిలుపునిచ్చారు. ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భం గా మధిరలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ని వాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ని జాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని నేటి పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడటమే ఐలమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, మండల కార్యవర్గ సభ్యులు ఎస్కే కొండ, నాగేశ్వ రరావు, వ్య.కా.సం నాయకులు కొండూరి నాగేశ్వరరావు, శివ, రామరస్వామి పాల్గొన్నారు.

# తిరుమలాయపాలెంలో నూతన ఎస్‌బిఐ సేవలు ప్రారంభం

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తిరులాయపాలెం మండల కేంద్రం లో ఎస్‌బిఐ సేవల కోసం ఎప్పటి నుండో ఎదురు చూస్తున్న ప్రజల కల సాకారమైంది. తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ ఎదురుగా నూత నంగా నిర్మించిన భవనంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు ఎస్‌బిఐ సేవలు అందించడం ఎంతో సంతోషదాయకమని, మండల కేంద్రంలో ఇప్పటి వరకు కేవలం స్థానిక గ్రామీణ బ్యాంకుల ద్వారా ప్రజలు రైతులు, చిరు వ్యాపారులు లావాదే వీలు చేసే వారని, ఇప్పటి నుండి ఎస్‌బిఐ సేవలు అందుబాటులోకి రావడం ఖాతాదారులంతా ఎస్‌బిఐ బ్యాంక్ నందు మార్చుకుంటారని, దీని ద్వారా బ్యాంక్‌కు మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. బ్యాంక్ అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ



కార్యక్రమంలో మాజీ ఎంపిపి బోడ మంగీలాల్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నాగేష్‌గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు తాటి కొండ కిరణ్, గుగ్గిల అంబేద్కర్, ఎస్కే సైపుద్దీన్, యువజన కాంగ్రెస్ నాయకులు దూదిమెట్ల వెంకట్, బ్యాంక్ మేనేజర్ తేజావత్ చైతన్‌నా యక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఇఓకు ఘన సన్మానం



ప్రజాపక్షం/ మధిర : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ప్రధా నోపాధ్యాయునిగా అవార్డు పొందిన ఎంఇఓ వై.ప్రభాకర్‌ను బుధవారం ఆయన ఆత్మీయ మిత్రులు అభినందించి సన్మానిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఎనిమిదేళ్లుగా ఎంఇఓగా బాధ్య తలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలను అందించేలా ఉపాధ్యా యులతో సమన్వయాన్ని నిర్వహిస్తూ విధి నిర్వహణలో బాధ్యతయుతమైన పాత్ర నిర్వహిస్తున్నా రని అన్నారు. ప్రస్తుతం టివిఎం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయన గత ఏడాది పదవ తరగతిలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నూటికి నూరుశాతం ఉత్తీ ర్ణత సాధించడం జరిగిందని, దీంతో తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డును ఇవ్వడం జరిగిందని, ఈ అవార్డు రావడం గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల బాలస్వామి, హెచ్‌ఎం స్వామిదాసు, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లు సతీష్, శ్రీనివాసరావు, బాలకోట రెడ్డి, చావల ఆజాద్‌చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం





ప్రజాపక్షం/వైరా: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భాంచన్ దొరా నీ కాల్మొక్త అనే నీచ సంస్కృతికి ఎదురొడ్డి పోరాడిన ధీరవనిత చిట్యాల ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, పార్టీ వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు కొనియాడారు. బుధవారం సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చిట్యాలమ్మ ఐలమ్మ 40వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక మున్సిపాలిటీ సమీపంలోని ఐలమ్మ విగ్రహానికి బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన చారిత్రక ఉద్యమంలో 4వేల మంది పోరాటయోధులు ప్రాణత్యాగం చేసి పేద ప్రజలకు 10లక్షల ఎకరాల భూమిన పంచారని, దున్నేవ వానికే భూమి చట్టాలను ప్రభుత్వాలు చేశాయని, కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా భూమి హక్కులు సాధించుకున్నామని తెలిపారు. సెప్టెంబర్ 10 నుండి 17 వరకు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు గ్రామగ్రామాన నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, నాయకులు పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్‌రావు, కొంగర సుధాకర్, కంసాని మల్లికాంబ, మల్లెంపాటి ప్రసాదరావు, మాడపాటి రామారావు, వడ్లమూడి మదు, చిట్టోజి నాగేశ్వరరావు, మాడపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీకి కుర్చీల వితరణ



ప్రజాపక్షం/చింతకాని : కాంగ్రెస్ పార్టీ చింతకాని మండల మైనార్టీ అధ్యక్షులు షేక్ పాషా వందనం గ్రామపంచాయతీకి 10 కుర్చీలు విరాళంగా ఇచ్చారు. బుధవారం వందనం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రావుకు పంచాయతీ కార్యాలయంలో కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా పాషా మట్లాడుతూ తన తల్లి షేక్ లాలబీ జ్ఞాపకార్థం ఈ కుర్చీలు అందజేసినట్లు తెలి పారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని సహ కార సంఘం లో సభ్యత్వం కలిగి మరణిం చిన రైతు కుటుంబానికి సంఘం ద్వారా ఇన్సూరెన్స్ చెక్కును చైర్మన్ కొండపల్లి శేఖర్ రెడ్డి అందజేశారు. నాగిలిగొండ గ్రామానికి చెందిన రైతు పదిలోజు రవికుమార్ ఇటీవల మరణించడంతో ఇన్సూరెన్స్ ద్వారా మం జూరైన రూ.50వేల చెక్కును రవికుమార్ భార్య ఉమ కు చింతకానిలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మారగాని శ్రీనివాసరావు, రైతులు కొనకంచి నర్సయ్య, ఆళ్ల కృష్ణ, నాగేశ్వరరావు సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# డంపింగ్‌యార్డుకు పరిష్కారమెప్పుడు..?

వ్యర్థాలు తరలింపుకు ఇబ్బందులు





ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో డంపింగ్‌యార్డ్ సమస్య పరిష్కారం తీరేది ఎప్పుడు అర్థంకాని పరిస్థితి. మున్సిపాలిటీ ఏర్పడిన సంవత్సరాలు గడుస్తున్నా నేటికి డంపింగ్‌యార్డ్ సమస్య పరిష్కారం చూపించలేకపోయారు. డంపింగ్ చేయడానికి అనుకూలంగా లేని ప్రాంతంలో డంపింగ్‌యార్డ్ గుర్తించామని చెప్పారు. ఆ ప్రాంతం డంపింగ్ చేయడానికి అనుకూలంగా లేదనే చెప్పవచ్చును. తల్లాడ మండలం రెడ్డిగూడెం రెవిన్యూలో కేటాయించిన డంపింగ్ స్థలానికి వాహనాలు పోవాలంటే వాహన డ్రైవర్లు ఎన్నో ఇబ్బందులు ఎదర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు వస్తే డంపింగ్ ఎక్కడ చేయాలో తెలియని పరిస్థితి. వైరా నది ప్రవహిస్తే డంపింగ్ కు కేటాయించిన రెడ్డిగూడెం రెవిన్యూలోని స్థలంలోకి పోయే పరిస్థితి లేదు. వైరాలోని వ్యర్థ దార్థాలు వాగులు వంకలు పొంగినప్పుడు ఎక్కడ డంప్ చేయాలి. వైరా మున్సిపాలిటీ వేధిస్తున్న అతి పెద్ద సమస్య డంపింగ్ సమస్య అని చెప్పవచ్చును. రోజు ట్రాక్టర్లలో ఆటోల్లో మున్సిపాలిటీలో స్వీకరించిన వ్యర్థ పదార్థాలు డంప్ చేయడానికి దినదినం గండంలా మారింది. సంవత్సరాలు గడుస్తున్నా ఈ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు. కనిపించేలా ఎవరు చర్యలు తీసుకోవడం లేదు. ఇలా డంపింగ్ సమస్యను వదిలేస్తే వ్యర్థాలు రోడ్ల వెంబడి డంప్ చేస్తే దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడటంతో పాటు రోగాలు వచ్చే పరిస్థితి కూడా ఉంది. వైరా నది బ్రిడ్జి వద్ద వ్యర్థపదార్థాలు డంప్ చేస్తున్నారు. దాంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో ప్రజలు పడే బాధలు చెప్పలేనివి. అక్కడ వ్యర్థ పదార్థాల దుర్వాసన తట్టుకోలేక చుట్టుపక్కల రైతులు స్టేజీపినపాక వద్ద ప్రజలు గతంలో డంపింగ్ చేయకుండా వాహనాలు పోకుండా గంటలు తీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే వైరా మున్సిపాలిటీకి డంపింగ్ సమస్య కలవరపెడుతుందని చెప్పవచ్చును. వ్యర్థ దార్థాలు తీసుకుపోవడానికి అనుకూలంగా లేకపోవడంతో వైరా నది బ్రిడ్జి వద్ద డంప్ చేస్తే వచ్చిన వరదలకు ఆ వ్యర్థాలు కొట్టుకుపోయి రైతుల పొలాల్లో మేటలు పెడుతున్నాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకొని మున్సిపాలిటీలో ఉన్న డంపింగ్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# సాగర్‌కాల్వకు నీటిని విడుదల చేయండి



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిధిలోని తనికెళ్ల నుంచి బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు వెళ్లే కాలువకు తనికెళ్లలోని మేజర్‌కాలువలకు నీరు ఎక్కకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయని తూములకు నీరు ఎక్కే విధంగా నీటిని విడుదల చేయాలని కోరుతు బికెఎస్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌పి సీఈకి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా బికెఎస్ మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ మాట్లాడుతు మేజర్ కాలువలకు నీరు ఎక్కకపోవడంతో సాగర్ ఆయకట్టు కింద పొలాలు ఎండిపోతున్నాయని తనికెళ్ల నుంచి బోనకల్ బ్రాంచ్ కెనాల్ నీరు వెళుతున్నా తనికెళ్ల రైతులు పంటపొలాలు ఎండిపోవడం దారుణమని ఈవిషయంపై ఎన్ఎస్‌పి అధికారులను కలిసి మేజర్ కాలువలకు నీరు ఎక్కే విధంగా నీటిటి విడుదల చేయలని కోరినట్లు తెలిపారు. అధికారులు కూడా స్పందించి తూములకు నీరు ఎక్కే విధంగా నీటి విడుదలను పెంచుతామని హామినిచ్చారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బికెఎస్ జోన్ కార్యదర్శి మందడపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగు పడి యువకుడి మృతి

యువకుడి కుటుంబానికి సంఘ్రా సంతాపం



ప్రజాపక్షం/సత్తుపల్లి: పిడుగు పడి యువకుడు మృతి చెందిన సంఘటన సత్యనారాయణపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాకలగూడెం పంచాయితీ, సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ధారావత్ పాషా, కాంతమ్మల దంపతుల రెండవ కుమారుడు ధారావతు చిన్న మహేష్ (35) బుధవారం గ్రామ సమీపంలోని పొలంలో గేదెలు మేపుతుండగా అకాల వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలో మహేష్ కు దగ్గరలో ఒక్కసారిగా పిడుగు పడటంతో మహేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవటంతో గమనించిన చుట్టుపక్కల వారు హుటాహుటిన సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మహేష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ చిన్నమహేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో చాంద్ పాషా, అద్దంకి అనిల్, వల్లభనేని పవన్, పర్వత లేని వేణు, గుండ్ల రఘు, మేకల నరసింహారావు, మిద్దే శీను తదితరులున్నారు.

**యువకుడి కుటుంబానికి సంఘ్రా సంతాపం...**

మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ధారావత్ మహేష్ పొలంలో పశువులను మేపుతుండగా ఆకస్మికంగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మహేష్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ విషయం కూసంపూడి మహేష్ ద్వారా తెలుసుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సంఘ్రా వెంకటవీరయ్య చరవాణి ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. యువకుని అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇలాంటి అనూహ్య ఘటనలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు. గతంలో తన క్యాంప్ కార్యాలయంలో చురుకుగా పనిచేసిన మహేష్ ఆకస్మికంగా మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు సంఘ్రా వెంకట వీరయ్య తెలిపారు.

# వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినికి సైకిల్ వితరణ



ప్రజాపక్షం/వైరా: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు జాలా పుల్లారావు ఆధ్వర్యంలో విజన్ కోఆర్డినేటర్ లయన్ వుంధ్రు శ్యామ్‌బాబు, వుంధ్రు వరలక్ష్మి దంపతుల పెళ్లిరోజు, వుంధ్రు వరలక్ష్మి పుట్టినరోజు, వుంధ్రు అజయ్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా వైరాకి చెందిన తంగెళ్ల రాధికాకు సైకిల్‌ను డిస్ట్రిక్ట్ 320 గవర్నర్ లయన్ మదన్ మోహన్ రేపాల సహకారంతో అందించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఆదుకోవడం గ్రేట్ విజన్ క్లబ్ ముందుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్‌రావు, జెడిసి చింతోజు నాగేశ్వరరావు, డిసి తోటకూర శ్రీకాంత్, సెక్రటరీ గంగవరపు కిషన్, ట్రెజరర్ వుయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి , కె.గోపి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్‌జిపిపిటి అధ్యక్ష, కార్యదర్శులుగా పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ లు ఎన్నికయ్యారు. పెన్షనర్ల సంఘ సమావేశం బుధవారం జరిగింది. అధ్యక్షులుగా పరిశ పుల్లయ్య, సంయుక్త అధ్యక్షులుగా కనపర్తి వెంకటేశ్వర్లు, ఐవి భాస్కరాచారి, ఉపాధ్యక్షులుగా పెదమళ్ల సత్యనారాయణ, కొలికొండ శరత్ బాబు, వెంకటేశ్వర్లు తదితరులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, కోశాధికారిగా గుర్రాల శ్రీనివాసరావు లు ఎన్నికయ్యారు. మొత్తం 33 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పుల్లయ్య, రవికుమార్ లు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరాట కార్యాచరణతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు. పాలకులు పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తున్నారని ఇందుకు వ్యతిరేకంగా రానున్న కాలంలో బహుముఖ పోరాటాలు నిర్వహిస్తామని పుల్లయ్య, రవికుమార్ లు తెలిపారు. ఎన్నికల అధికారిగా వి. రాంమనోహర్, తుమ్మ వీరయ్య లు వ్యవహరించగా రాష్ట్ర పరిశీలకులుగా జి. వీరస్వామి, కె. సుధీర్‌బాబు లు హాజరయ్యారు.

# వైరా మండల ప్రత్యేక అధికారిగా పద్మావతి



ప్రజాపక్షం/వైరా: వైరా మండల ప్రత్యేక అధికారినిగా జి.నళిని పద్మావతి బాధ్యతలు స్వీకరించారు. వైరా మండలంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించిన కస్తాల సత్యనారాయణ పదవీవిరమణ చేసిన తర్వాత మెప్మా పిడిగా విదులు నిర్వహిస్తున్న జి.నళిని పద్మావతిని వైరా మండల ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా నాదృష్టికి తీసుకురావచ్చని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో తాను తరచుగా పర్యటించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# నేడు అశ్వారావుపేట మండలంలో ఎమ్మెల్యే జారే పర్యటన



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట మండలంలో గురువారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని తిరుమలకుంట, ఆసుపాక, బచ్చువారిగూడెం, ఊట్లపల్లి, అశ్వారావుపేట, నారావారిగూడెం, , దిబ్బగూడెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలో లబ్ధిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనలో అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# అక్రమ మట్టి తవ్వకాలపై కొరడా

ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ కేంద్రంలో అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో అక్రమ మట్టి తవ్వకాలను సాగిస్తున్న టాక్టర్లను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మైథిలి తన సిబ్బంది ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ చెరువులు, బావుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఘనంగా చాకలి ఐలమ్మకు నివాళి



ప్రజాపక్షం/వైరా: వైరాలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి వైరా పట్టణ రజక సంఘం అధ్యక్షుడు ఏదునూరి శ్రీను పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ పోరాటాలను గురించి మాట్లాడారు. భావితరాలు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు పోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా పట్టణ రజక సంఘం సభ్యులు సంగెపు వెంకన్న, రేమల్ల కోటేశ్వరరావు, ఏదునూరి చిన్న వెంకన్న, రేగళ్ల వీరభద్రం, ఏదునూరి శ్రీను(బుజ్జి), గడసందుల పెద్ద దర్గయ్య, ఏదునూరి చిన్న కోటయ్య, బొసాటి రామారావు, గరిడేపల్లి కిషోర్, రమేల్ల రాము, ఏదునూరి రాము, రాచకొండ సాయి, ఏదునూరి పెద్ద గోపి, తాళ్లూరు నవీన్, ఏదునూరి చిన్న గోపి, బొసటి హనుమంతరావు, గరిడేపల్లి వెంకటనారాయణ, ఏదునూరి పవన్, సత్తెనపల్లి రమాదేవి, సత్తెనపల్లి పద్మ పాల్గొన్నారు.

# వైరాలో బిజెపి సంబరాలు



ప్రజాపక్షం/వైరా: బిజెపి బలపరిచిన ఎన్‌డిఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ కాంగ్రేస్ అభ్యర్థిపై భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు ఆదేశానుసారం వైరా పట్టణ అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతనిప్పు రామారావు, పల్లపాటి వెంకటేష్, వల్లెపు అనిల్, ఉదయ్‌కిరణ్, వడ్లమూడి వెంకటరావు, గూడూరు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలం

**ప్రతి రైతుకు యూరియా అందించాలి**
**సమస్యల పరిష్కారంకోసం రైతాంగం ఉద్యమబాట పట్టాలి**
**ఎస్‌కెఎం జిల్లా సదస్సులో రైతు సంఘాల నేతలు**




ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు ఘోరంగా విఫలం చెందుతున్నారని, ఫలితంగా రైతులు నష్టాల ఊబిలోకి నెట్టివేయబడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఐక్యూవెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుమ్మడి నరసయ్య తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్ ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ఫ్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్లో జిల్లా స్థాయి సదస్సు రైతు సంఘం జిల్లా నాయకులు చంద్ర నరేంద్రకుమార్, అమర్లపూడి రాము అధ్యక్షతన బుధవారం జరిగింది. సదస్సులో రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతాంగానికి యూరియా సరఫరాలో కేంద్రం పూర్తిగా విఫలమైందని, దీంతో రైతులు పంటలను నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పత్తి దిగుమతి సుంకం 11శాతం, పత్తికి క్వింటాకు రూ.10,075 చెల్లించాలని, వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ ఉత్పత్తులను మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలనీ, జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల భీమా పథకాన్ని అమలుచేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం భరోసాగా ఉండాలన్నారు. రైతులను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు తప్పవని, రైతులను సమీకరించి పాలనను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. సదస్సులో కిసాన్ మోర్చా నాయకులు సలిగంటి శ్రీనివాస్, బుర్రా వెంకన్న, బానోతు ఊక్లా, కోరం వెంకటేశ్వర్లు, కట్ల నాగయ్య, బొప్పన హరిబాబు, నిమ్మల రాంబాబు పాల్గొన్నారు.

# పిడుగు పాటుకు వ్యక్తి మృతి



ప్రజాపక్షం/గుండాల : మండల పరిధిలోని చీమలగూడెం గ్రామానికి చెందిన పాయం నర్సయ్య (50) గత మంగళవారం చేనువద్దకు వెళ్లిన సందర్భంలో కురిసిన భారీ వర్షానికి ఉరుముల మెరుపులతో పిడుగు పడటంతో మృత్యువాతకు గురైన సంఘటన చోటు చేకుంది . మృతునికి కుటుంబానికి అన్నివిదాలుగా ప్రభుత్వం ఆదుకావాలని అక్కడి స్థానికులు వేడుకున్నారు. నర్సయ్య మృతదేహాన్ని ఇల్లందు పోస్టు మార్టం నిమిత్తం స్థానిక పోలీస్ ఎస్ హెచ్ఒ సైదా రవూప్ తరలించి కేసునమోదు చేశారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



ప్రజాపక్షం/అశ్వాపురం: మండల కేంద్రంలోని మంచినీళ్ల లక్ష్మయ్య లాండ్రీ షాప్ ఎదురుగా బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె ఆశయాలను మనమందరం ముందుకు తీసుకుపోవాలని, ఆమె పోరాట పటిమను, ఉద్యమ స్ఫూర్తిని ఈసందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు గోగినపల్లి సత్యం, మంచినీళ్ల లక్ష్మయ్య, పావురాల లాలయ్య, దునిసరపు మల్లయ్య, కుమ్మరి కుంట్ల శ్రీను, నిమ్మల సత్యం, పావురాల ప్రవీణ్, అద్దంకి భద్రం, అద్దంకి రవి, గోగినపల్లి శివకృష్ణ, దోనెపల్లి వేణు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా చికెన్ గున్యా.. మలేరియా కేసులు నిల్

**-డెంగీ కేసులు అంతా రికవరీ**
**-డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్. కళావతిభాయి**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : జిల్లాలో డెంగీ కేసుల బాధితులు అంతా కోలుకున్నారని..ఎలాంటి ప్రమాదం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. డి.కళావతి భాయ్ పేర్కొన్నారు. నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చెరువుమాధారం, పైనంపల్లి ఉప కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు వద్ద కు వెళ్లి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు.... జిల్లాలో ప్రతీ ఇంటింటి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. దాదాపు గా 3.11 లక్షల ఇళ్ల ను సందర్శించినట్లు తెలిపారు. వీటిలో 7.45 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కేవలం 3,712 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డెంగీ 155 కేసులు నమోదు కాగా... వారంతా రికవరీ అయ్యారని పేర్కొన్నారు. చికెన్ గున్యా 4024 మంది కి పరీక్షలు నిర్వహించగా ఒక్క కేసు కూడ నమోదు కాలేదన్నారు. అదే విధంగా మలేరియా 64,914 మందికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ కేసు నమోదు కాలేదన్నారు. ప్రస్తుతం జిల్లాలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా అదుపులో ఉన్నట్లు తెలిపారు భూక్యాప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉన్న విషయం ను ప్రజలకు తెలిసేలా చైతన్యం చేయాలని అన్నారు. గ్రామాలలో వాటర్ ట్యాంక్లను శుభ్రం చేయటం, మంచినీరు కలుషితం కాకుండా అప్రమతంగా ఉండాలని అన్నారు. పారిశుద్ధం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను చెరువుమాధారం ను, తరలించే విషయం ప్రస్తుతానికి లేదన్నారు. ఉన్న సబ్ సెంటర్ లో సౌకర్యం లేకపోవటం వలన అక్కడ నూతన భవనం నిర్మించిన తరువాతనే మార్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్.ఆర్.శ్రావణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని బుద్దగూడెం కేంద్రం అక్రమ ఇసుకను తరలిస్తున్న లారీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుద్దగూడెం పరిధిలో అక్రమంగా ఇసుకను లారీల ద్వారా రవాణా చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున బూర్గంపాడు అదనపు ఎస్ఐ నాగబిక్షం సిబ్బందితో వెళ్లి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ టిఎస్36టీ4438 నెంబర్ కలిగిన లారీని పట్టుకోగా, డ్రైవర్ పరారీ కావడం జరిగిందని తెలిపారు. పట్టుబడిక లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పిడుగు పడి రైతుకు తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని మిర్చి తోటలో పిడుగు పడి అదే గ్రామానికి చెందిన రైతు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మినేపల్లి గ్రామానికి చెందిన రైతు గుగులోత్ బాన్‌సింగ్(40)తన మిర్చి తోటలో బుధవారం కూలీలతో సాగు చెట్లు వేయిస్తుండగా వర్షం వచ్చింది. ఇంటికి వద్దామని చేను నుండి వస్తుండగా అతని సమీపంలో పిడుగు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతనిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు.

# కాండం తొలిచే పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని భగత్‌వీడు గ్రామంలో బుధవారం వరి పొలాలను కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో అక్కడక్కాడా కాండం తొలిచే పురుగును గమనించడం జరిగిందని తెలిపారు. కాండం తొలిచే పురుగు అంకురం నుండి చిరుపొట్ట దశలో ఆశిస్తే, ఈనే దశలో గింజలకు పోషక పదార్థాలు అందక, గింజలన్నీ తాలు గింజలుగా మారి తెల్ల కంకులు ఏర్పడతాయని, ఆలస్యంగా లేదా ముదురు నారు నాటడం, కరువు పరిస్థితులు తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు, సూర్యరశ్మి రోజుకు 7 గంటల కంటే తక్కువ, నత్రజనికి సంబంధించిన ఎరువులను మోతాదుకు మించి వాడటం ఈ పురుగు ఉధృతికి అనుకూలమైన పరిస్థితులు అన్నారు. చదరపు మీటరకు ఒక తల్లి పురుగు లేదా గ్రుడ్ల సముదాయం లేదా 10శాతం చచ్చిన మొవ్వులు లేదా లింగాకర్షక బుట్టలలో వారానికి బుట్టకు 25,30 మగ రెక్కల పురుగులు గమనించినప్పుడు మాత్రమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉధృతిని బట్టి సస్యరక్షణ మందులైన క్వినాల్‌ఫాస్ 2 మిలీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మిలీ లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పి 1.5 గ్రామ లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సి 0.3 మిలీ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పి 2 గ్రామ లేదా టెట్రానిలిప్రోల్ 05 మిలీ లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారీ చేయాలన్నారు. వరిలో అగ్గితెగులు గమనించినట్లయితే ట్రైసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సౌమ్య, రవీందర్, రైతులు పాల్గొన్నారు.

# మండలానికి అత్యధిక యూరియా సరఫరా



ప్రజాపక్షం/గుండాల : భద్రాద్రి జిల్లా గుండాల మండలానికి పిఎసిఎస్ ద్వార అత్యధికంగా యూరియాను సరఫరాచేయడం జరిగిందని వ్యవసాయశాఖ అధికారి ఎడిఏ తాతరావు అన్నారు. బుదవారం స్థానిక పిఎసిఎస్‌ని సందర్శించి వర్షాకాల సీజన్ గాను ఏప్రిల్‌నుండి సెప్టెంబర్ 9వరకు 24425 యూరియా బ్యాగులను అనగా 1099 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందన్నారు. యూరియా సరఫరాలో జిల్లాలోనే పిఎసిఎస్ ద్వారా రెండో స్థానం ఉందన్నారు. ఇల్లందు మొదటి స్థానం అన్నారు. మండలానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిదిలోని కాచనపల్లి రైతు వేదిక యందు బుదవారం 120 యూరియా బ్యాగులను రైతులకు అందించడం జరిగిందన్నారు. రైతుల అవసరాల మేరకు మండల రైతులకు యూరియా సరఫరా చేయడానికి తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఏఒ వెంకటరమణ, ఏఇఒలు బాలరాజు, లెనిన్ ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న గ్రామంలో సర్పంచులు లే గ్రామాలలో పరిపాలన అస్తవ్యస్తమైందని అన్నారు. గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు రాక గ్రామ వ్యవస్థ కుంటిపడిపోయిందని తెలిపారు. గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ పాలన ఏర్పడిన తర్వాత ఎవరికి ఏం చెప్పాలో తెలియని స్థితిలో గ్రామ ప్రజలు ఉన్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పై భారం పడడంతో అప్పుల బాధ పడుతున్నారు అని తెలిపారు. నిధులు లేక గ్రామలలో పారిశుద్ధ్య కార్మికుల జీతాలు లేక, గ్రామాలలో వీధిలైట్లు కొరత, పారిశుద్ధం కొరత ఎక్కువగా ఉన్నదని అన్నారు. ఇప్పటి వరకు ఎలక్షన్స్ జరుగక పోవడం చాలా నిర్లక్ష్యమని,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి తెలంగాణ గ్రామ పంచాయతీ ఎలక్షన్స్ జరిపించి గ్రామాలలో మంచి పాలన చూడాలని కోరారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ పాత్ర విరోచితమైనదని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద బుధవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిలించిన అగ్నికణం చాకలి ఐలమ్మ అని అన్నారు. అనేకమందికి విప్లవ భావాలను మండించిన నిప్పుల కొలిమి ఐలమ్మ అని తెలిపారు. విస్నూర్ దొర రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలపై అగ్ని కణంలో మారి ముందుకు దూకిన తొలి వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ నాయకులు అనంత పుల్లయ్య, యెచ్చర్ల గౌరి శంకర్, చెన్నబోయిన మల్లయ్య, అబ్దుల్ సత్తార్, గుడిమెట్ల శ్రీనివాసరావు, బుడుగు మాధవరావు, మూడు శ్రీనివాసరావు, భూక్యా నాగేశ్వరరావు, కాసాని వెంకన్న, కొండ్రుగొట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం లేఅవుట్ అనుమతులు జారీ

**-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో లేవుట్ అనుమతులు జారీ అంశంలో నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన లేఅవుట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి ప్రతి లేఅవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న దరఖాస్తుల ప్రాంతాలను సాంకేతికతను వినియోగిస్తూ జిల్లా కలెక్టర్ గతంలో అక్కడ ఏమైనా నీటి వనరులు ఉన్నాయా వంటి అంశాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్ అనుమతులను నిబంధనల ప్రకారం జారీ చేయాలన్నారు. చివరి నిమిషంలో నాలా కన్వర్షెషన్ సంబంధించి ఫీజు చెల్లింపులు చేసి సమావేశానికి తీసుకు వచ్చిన ప్రతిపాదనలు మరోసారి పరిశీలించి పూర్తి స్థాయిలో అన్ని నిబంధనలు పాటిస్తున్నారో లేదో గమనించాలని కోరారు. లేఅవుట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌టిఎస్ ఎం. రాజేశ్వరి, సుడా సిపివో వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌ను విజయవంతం చేయండి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మహిళల ఆరోగ్యం సక్రమంగా ఉంటనే కుటుంబ ఆరోగ్యవంతంగా, బలంగా నిలుస్తుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులతో ఐడిఓసిలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని వైద్యారోగ్య శాఖాధికారులను ఆదేశించారు. మహిళల ఆరోగ్య రక్షణలో ఈ కార్యక్రమం ఓ మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. మారిన జీవనశైలి, పర్యావరణ పరిస్థితుల కారణంగా మహిళలు అధికంగా బిపి,షుగర్, గుండెసంబంధిత వ్యాధులు, పిసిఓడి, రుతుక్రమ సమస్యలు వంటి వాటికి గురవుతున్నారని, ఈ క్యాంపుల ద్వారా మహిళలు ఆరోగ్య పరిక్షణ జరుగుతుందన్నారు. అక్టోబర్ 1న జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదానం శిబిరం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వైద్యాధికారి జయలక్ష్మి, డిసిహెచ్‌ఓ రవిబాబు, జిల్లా పంచాయితీ అధికారి చంద్రమౌళి, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిని స్వర్ణలత లెనినా, మున్సిపల్ కమీషనర్లు సుజాత, శ్రీకాంత్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం

**- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్**





**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆర్టిసి కార్మికుల సమస్యలు పరిష్కరామయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఐ రాష్టసమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. గత మూడ్రోజులుగా భద్రాచలం డిపో పరిధిలోని ఆర్టిసి టిం డ్రైవర్లు చేస్తున్న నిరసనకు బుధవారం సిపిఐ ప్రతినిధి బృంధం సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా కార్మికుల పక్షాన డిపో మేనేజర్ తిరుపతితో సిపిఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ, ఏఐటియూసి పట్టణ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాస్, నాయకులు ఏపూరి బ్రహ్మం, ఎస్‌విఎస్ నాయుడు, వంక మహేష్ తదితరులతో కలిసి సుమారు గంటపాటు చర్చలు జరిపారు. కార్మికుల డిమాండ్లు సరైనవే అని, డిఎంగా మీరు విధుల్లో చేరిన నాటి నుండి చేసిన సంస్కరణలను మీరే మార్చు చేయాలని కోరినప్పటికీ డిఎం తిరుపతి మొండి వైఖరి ప్రదర్శించడంతో చర్చలు విఫలమయ్యాయి. అనంతరం రవికుమార్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులకు మేలు చేసే రీతిలో డిఎం తీరు లేదని, రీజియన్ పరిధిలో ఎక్కడా లేని విధంగా పనిభారం భద్రాచలం డిపోలోనే ఉందని, దీనిలో మార్పులు చేసి కార్మికులకు మేలు చేయాలని కోరినప్పటికీ చూస్తామంటూ మాట దాటవేస్తున్నారని మండిపడ్డారు. పనిభారంతో కార్మికులు, మానసికంగా, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు అనారోగ్యాల పాలవుతూ విధులు నిర్వహించలేక పోతున్నారని చెప్పారు. అనంతరం డిఎం మొండివైఖరి మారాలని, కార్మికుల ఐఖ్యత వర్ధిల్లాల్లి, పని భారాన్ని తగ్గించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొండబాబు, సీతారామ రాజు, చాడా శోభన్‌బాబు, నారపోగు ఏసు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న నిరసన..

గత మూడురోజులుగా ఆర్టిసి కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా టిం డ్రైవర్‌లు అంతా ఐఖ్యతతో డిపో ఆవరణలోనే ఉండి విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా వారికి సిపిఐ, ఏఐటియూసి, సిపిఎం, సిఐటియూతో పాటు పలువురు సంఘీభావం తెలుపుతున్నారు. టిం డ్రైవర్లు డిపో ప్రాంగణంలోనే ఆల్పాహారం, మధ్యాహ్న,రాత్రి భోజనాలు చేస్తున్నారు.

# కార్యకర్తల కష్టమే నేటి అధికారం

**-ఎస్‌సి కార్పోరేషన్ ఛైర్మన్ ప్రీతం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగానే నేడు పార్టీ అధికారంలో కొనసాగుతుందని ఎస్‌సి కార్పోరేషన్ ఛైర్మన్ ప్రీతం తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఎస్‌సి సెల్ అధ్యక్షులు బొందయ్య అధ్యక్షతన దళిత విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రీతం మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సిలకు రిజర్వు చేయబడిన అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలను గెలిపించుకునే బాధ్యత దళితులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సి కార్పోరేషన్ ద్వారా దళితులను ఆదుకునేందుకు చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వం ఎస్సి కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేసిందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎస్సి కార్పోరేషన్‌ను ప్రక్షాళన చేసి ఆర్థిక ఊతమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దళితుల సమస్యలను పార్టీ దృష్టికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎస్సి సెల్ నాయకులు చెన్నారావు, దాసరి దానియేల్, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సాయికుమార్, గౌస్, గజ్జెల్లి వెంకన్న, సంతోష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీకని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా వెనుబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన ఐడిఓసిలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టర్ హాజరై ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ పోరాట పటిమ నేటికి స్ఫూర్తిదాయకం అన్నారు. సమాజంలో ఆమె గొప్పతనాన్ని చాటాలని, నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, విజయలక్ష్మి, శ్రీలత, అజిత్‌కుమార్, ముదిగొండ రాంబాబు, సర్వేష్, జంగపల్లి రాజు, దురుశెట్టి కుమార్, విజయలక్ష్మి, కొదుమూరి సత్యనారాయణ, కాపర్తి వెంకటాచారితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటం ఆదర్శం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** చాకలి ఐలమ్మ జీవితం, పోరాటం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని గ్రంధాలయంసంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధని పురస్కరించుకుని గ్రంధాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూల మాలలేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భుమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముర్తి కోసం ఆమె చేసిన అలుపెరగని పోరాటం ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఆమె చూపిన తెగువ, పోరాట పటిమ ఎంతో గొప్పదని, ఆమె ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఎన్ని అడ్డంకులు ఎదురైనా మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అదిరోహించి సమసమాజ స్థాపనకు పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాలు మణిమృదుల, పాఠకులు ఉపేందర్, పలు పాఠశాలల విద్యార్థిలు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గంతోనే కేసులు పరిష్కరించుకోవాలి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాజీమార్గం ద్వారానే కేసులు పరిష్కరించుకోవాలని, ఇందు కోసం ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా నాయ్యసేవాధికారసంస్థ కార్యదర్శి ఎం రాజేందర్ అన్నారు. బుధవారం ఆయన లైబ్రెరీ సమావేశ మందిరంలో ఆయన న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులు తమ వివాదాలను సామరస్యంగా, త్వరిత గతిన పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాజీకు వీలయ్యే సివిల్, క్రిమినల్‌తో పాటు పలు రకాలు కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, గోపికృష్ణ, అడబాల పార్వతి, చిన్నకృష్ణ, పురుషోత్తంరావు, నిరంజన్ రావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పోరాట స్ఫూర్తికి ప్రతీకగా చాకలి ఐలమ్మ నిలుస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంఘ సేవకురాలిగా భూమి, భూక్తి విముక్తి కోసం జరిగిన పోరాటంలో మహోన్నత పాత్ర నిర్వహించిన ఐలమ్మ ధన్యురాలన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు జి. జ్యోతి, వివిధ సంఘాల నాయకులు యలగొండ స్వామి, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, జక్కుల వెంకట రమణ, బ్రహ్మయ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసిన వీర వనిత ఐలమ్మ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** నిజాం నియంతృత్వ పాలనపై భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి ఎర్రజెండా పట్టి గడగడలాడించిన వీర వనిత చాకలి ఐలమ్మ అని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రం ఎర్రుపాలెంలో రామిశెట్టి పుల్లయ్య భవనం నందు బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవానికి నాంది పలికిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. మతతత్వాన్ని పెంచిపోషిస్తున్న బిజెపి వంటిశక్తులు రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గామాసు జోగయ్య, షేక్.నాగుల్‌మీరా, నాగులవంచ వెంకటారమ్మ, కుర్ర వెంకటరామయ్య, రాములు, ఆశీర్వాదం, జనార్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.